క్లుప్తంగా

వైభవంగా తృతీయ వార్షిక వేడుకలు



పి.నైనవరం(విజయవాడరూరల్): పి.నైనవరం గ్రామంలో నాగసాయిబాబా మందిరంలో విగ్రహ ప్రతిష్ఠ తృతీయ వార్షిక వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. ముందుగా గోపూజ నిర్వహించారు. అనంతరం సాయిబాబా వారికి పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, బాబా వారి మూలమంత్ర హోమాలు నిర్వహించగా అంబాపురం, పి.నైనవరం, పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం భజన కార్యక్రమాలు, అన్నసంతర్పణ జరిగింది. ఆలయ ధర్మకర్త షేక్ లాల్‌బాష పీరాబి దంపతులు, భక్తులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలను దీవి లక్ష్మీనారాయణచార్యులు, అద్దేపల్లి శివరామకృష్ణ ప్రసాద్‌శర్మ నిర్వహించారు.

దేవస్థానంలో ప్రత్యేక పూజలు



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీపార్వతీ సమేత శ్రీరామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. శ్రావణమాసం సందర్భంగా చండీహోమం చేశారు. సాయంత్రం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం చేసిన తరువాత పంచహారతులు ఇచ్చారు. రాత్రి స్వామివారి పల్లకీసేవ వైభవంగా చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్మాణ దాత సంగా నరసింహారావు, ప్రధాన అర్చకుడు జీఆర్‌వీ.సాగర్, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.భవాని పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ మండల అధ్యక్షుడిగా విజయ్‌కుమార్



గన్నవరం: మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) ఉంగుటూరు మండల అధ్యక్షుడిగా పైడిముక్కల విజయ్‌కుమార్ ఎన్నికయ్యారు. మండలంలోని తేలప్రోలులో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్‌బాబు నేతృత్వంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘ నియోజకవర్గ అధ్యక్షుడు డీ.ఏసుబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల నూతన ప్రధాన కార్యదర్శిగా గుడ్డేటి విజయ్‌గాంధీ, కోశాధికారిగా చౌటపల్లి నరేష్ ఎన్నికయ్యారని పేర్కొన్నారు. సంఘం బలోపేతానికి, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యవర్గం కృషి చేయాలని కోరారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత



ఉయ్యూరు: మొక్కల పెంపకాన్ని సామాజిక బాధ్యతగా చేపట్టాలని కేసీపీ సీఓఓ వై.సీతారామదాసు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో బయోటెక్ విభాగం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ నినాదంతో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. సీతారామదాసు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కల పెంపకమే మార్గమన్నారు. కాలుష్యరహిత సమాజ స్థాపనలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమం లక్ష్యంగా రోటరీ కార్యాచరణ చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సంస్థ జీఎంలు వీవీ పున్నారావు, జి.వెంకటేశ్వర్లు, క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు నాగ సుబ్రమణ్యం, ప్రతినిధులు సయ్యద్ అనిస్, అమీర్ మీర్జా, ఇమ్రాన్, తేజ, వెంకటేశ్వరరావు, కల్యాణ్ పాల్గొన్నారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

పటమట(విజయవాడతూర్పు): చిన్నారులకు అవగాహన కల్పించడంతోనే లైంగిక దాడులను నివారించవచ్చని పటమట మహిళా పోలీస్ సిబ్బంది తెలిపారు. పటమటలోని నిర్మలా కాన్వెంట్‌లో సోమవారం చిన్నారులకు పోలీసు శక్తి టీం ఆధ్వర్యంలో గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిన్నారులు తమ సొంత బంధువులైనా తాకరానిచోట తాకితే వెంటనే గట్టిగా కేకలు పెట్టాలని సూచించారు. ప్రతి విషయాన్ని తల్లికి వివరించాలని పేర్కొన్నారు. చిన్నారుల భద్రతపై అందరూ శ్రద్ధ తీసుకోవాలని, వారి ఆత్మరక్షణకు అవసరమైన కోర్సులు నేర్పించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ గిబీ ఆంటోనీ, తదితరులు పాల్గొన్నారు.

సప్లయ్ చానల్స్ లేక సమస్యలు

- సప్లయ్ చానల్స్ లేక సమస్యలు ఎదుర్కొంటున్న రైతులు
- పోలవరం నీళ్లు కావాలంటే మోటార్లు ఆడాల్సిందే
- రైతులకు భారంగా మోటార్లు
- సప్లయ్ చానల్స్ ఏర్పాటు చేయాలంటున్న రైతులు



నున్నలో పోలవరం కాల్వపై మోటార్లు

విజయవాడరూరల్: పోలవరం కుడి ప్రధాన కాల్వ నుంచి గ్రామాల్లో చెరువులకు సప్లయ్ చానల్ ద్వారా సాగునీటిని అందించాలని రైతులు కోరుతున్నారు. పోలవరం నీటికోసం మోటార్లను వినియోగించటం వల్ల ఆర్థిక భారం పెరిగిపోతోందని రైతులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించాలని కోరుతున్నారు.

9 నెలలపాటు మోటార్లు ఆడాల్సిందే..

పోలవరం కుడి ప్రధాన కాల్వను ఆనుకొని ఉన్న గన్నవరం, విజయవాడ రూరల్ మండలాల్లోని రైతాంగం ప్రతి ఏటా మోటార్లు పెట్టుకొని చెరువులను నింపుకొని ఆయకట్టు వ్యవసాయ భూములకు నీరు పెట్టుకోవడం జరుగుతుంది. ఖరీఫ్ సీజన్‌లో వరిసాగు చేసుకొనే రైతులు దాదాపు 9 నెలల పాటు మోటార్ల ద్వారా పోలవరం కాల్వ నుంచి నీటిని ఎత్తిపోసుకొని పంటలను సాగు చేసుకోవడం కష్ట సాధ్యమవుతుందంటున్నారు.

ప్రతి ఏటా రూ.లక్షల్లో ఖర్చు

మోటార్లను నిర్వహించడం వలన ప్రతి ఏటా రెండు లక్షల రూపాయల ఖర్చు ఒక్క నున్న గ్రామంలోనే అవుతుందని రైతులు చెబుతున్నారు. ఒక్కో రైతు నుంచి ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేసి మోటార్లను ఆడించడం జరుగుతుందని రైతులు అంటున్నారు. ఆ విధంగా నున్న గ్రామంతో పాటు విలేజి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం గ్రామాల రైతులు మోటార్లతో చెరువులను నింపుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. చెరువుల నుంచి మళ్లీ పొలాలకు నీటిని తరలించాలంటే మోటార్లే దిక్కు. ప్రభుత్వం పోలవరం కాల్వ నుంచి సప్లయ్ చానల్ ద్వారా చెరువులను నింపినట్లయితే రైతులకు ఖర్చులు తగ్గి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని అభిప్రాయం పడుతున్నారు.

గతంలో ఇలా..

గన్నవరం నియోజకవర్గంలో అనేక గ్రామాల్లో రైతుల సౌకర్యార్థం వల్లభనేని వంశీ ఉచితంగా మోటార్లను ఏర్పాటు చేశారు. ఆ నాటి నుంచి ఈ నాటి వరకు రైతులే మోటార్ల నిర్వహణ బాధ్యతలను భరిస్తున్నారు. గతంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సప్లయ్ చానల్స్ ఏర్పాటు చేసి రైతులకు సాగునీటిని సరఫరా చేయాలని వినతి పత్రం ద్వారా కోరారు. ఈ ప్రయత్నాలు జరుగుతున్న సమయంలో ప్రభుత్వం మారిపోయింది.

ప్రభుత్వం స్పందించాలి

మోటార్లను వదలడం, రిపేర్లు చేయించడం లాంటి ఖర్చులు లేకుండా రాష్ట్ర ప్రభుత్వం సప్లయ్ చానెల్స్ ఏర్పాటు చేసి గ్రామాల్లోని చెరువులకు పోలవరం కాల్వ నీటిని సరఫరా చేయాలని కోరుతున్నారు. పోలవరం కాల్వ నీటితో నున్న, విలేజి కండ్రిక, పాతపాడు, పి.నైనవరం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల సాగు అవుతుంది. గన్నవరం మండలంలోని కొన్ని గ్రామాల్లో కూడా చెరువుల ఆయకట్టు భూములు పోలవరం నీటి ద్వారానే సాగు అవుతున్నాయి. ఈ సమస్యను ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పరిగణలోకి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



నున్న గ్రామంలో పోలవరం కాల్వ నీటితో ఉన్న చెరువు

సప్లయ్ చానల్స్ ఏర్పాటు చేయాలి



పోలవరం కుడి ప్రధాన కాల్వ పరిధిలోని గ్రామాల్లో చెరువులకు ప్రభుత్వం సప్లయ్ చానల్స్ ద్వారా సాగునీటిని సరఫరా చేస్తే రైతులకు సౌకర్యంగా ఉంటుంది. ప్రతి ఏటా మోటార్ల నిర్వహణకు లక్షలాది రూపాయలను రైతులు భరించుకోవాల్సి వస్తోంది.
– భీమవరపు శివశేషిరెడ్డి, నున్న గ్రామ రైతు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళతాం

పోలవరం కాల్వ నుంచి సప్లయ్ చానల్ ఏర్పాటు చేయాలని రైతులు కోరితే ప్రభుత్వ దృష్టికి తీసుకెళతాం. సప్లయ్ చానల్స్ ద్వారా నీరు సరఫరా చేసే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. రైతుల వినతి మేరకు చర్యలు తీసుకుంటాం.
– పి.వెంకటేశ్వర్లు, ఈఈ, ఇరిగేషన్, పోలవరం

యూరియా కోసం రైతుల పడిగాపులు



ఉంగుటూరు(గన్నవరం): ఖరీఫ్ సాగు అవసరాలకు అనుగుణంగా యూరియా అందుబాటులో లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. యూరియా కొరత కారణంగా రైతులు పీఏసీఎస్‌ల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఉంగుటూరు పీఏసీఎస్ వద్ద సోమవారం యూరియా కోసం రైతులు వందల సంఖ్యలో బారులు తీరారు. ఖరీఫ్ అవసరాల మేరకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా యూరియా కోసం పీఏసీఎస్‌ల వద్ద రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు రైతుల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

హుండీ కానుకల లెక్కింపు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.10.32 లక్షలు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణా ధికారి పితాని తారకేశ్వరరావు తెలిపారు. దేవస్థానం కార్యాలయం ప్రాంగణంలో దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో స్వామి వారి హుండీ ఆదాయం లెక్కింపు సోమవారం నిర్వహించారు. దేవదాయ శాఖ అధికారి ఎం.రాంబాబు పర్యవేక్షణాధికారిగా హాజరయ్యారు. గత 76 రోజులకు గానూ రూ.10,32,522 వచ్చినట్లు వివరించారు. ఆలయ మాజీ చైర్మన్ పావులూరి రామారావు, గ్రామ ప్రముఖులు వేమూరి శ్రీనివాసరావు, గరికపాటి నాగేశ్వరరావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్త మండలి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్యం



కంకిపాడులో పోస్టరు ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ అనూష, తహసీల్దార్ భావనారాయణ



హెచ్ఎం సరళతో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

కంకిపాడు: నులి పురుగుల నిర్మూలనతో ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయని ఎంపీడీఓ పి.అనూష అన్నారు. జాతీయ నులి పురుగు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఎంపీడీఓ, తహసీల్దార్ భావనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తహీనతను అధికమించేందుకు నులి పురుగులను నిర్మూలించాలన్నారు. దీనివల్ల పోషకాలను గ్రహించే శక్తి పెరుగుతుందన్నారు. ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. నులి పురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ సుధా ప్రసూజ, ఎంపీహెచ్ఈఓలు శ్రీనివాసరావు, కృష్ణారావు, పలువురు ఉపాధ్యాయులు, వైద్య ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఆత్కూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది విస్తృత ప్రచారం నిర్వహించారు. మండలంలోని వీరపనేనిగూడెంలో, తెంపల్లి, కొత్తగూడెం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రచారం చేశారు. రక్తహీనత నిర్మూలనకు, పోషకాలు పెంపునకు నులి పురుగుల నివారణ మాత్రలు విద్యార్థులకు తప్పనిసరిగా అందజేయాలని హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సూచించారు. ఏఎన్ఎం మాలతి, ఆశావర్కర్‌లు సునీత, రాజకుమారి, వాణి, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

స్వచ్ఛ రథాల ప్రారంభం



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో సోమవారం స్వచ్ఛ రథాలను గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, నున్న గ్రామాలకు సంభందించి స్వచ్ఛ రథాలను ఈ సందర్భంగా వెంకట్రావు ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని అధికారులకు సూచించారు. పొడి చెత్త అయిన ప్లాస్టిక్, పాత పేపర్లు, గాజు సీసాలు వంటి వాటిని సేకరిస్తారన్నారు. వీటి విలువను నిర్ణయించి ఈ స్వచ్ఛ రథాల ద్వారా నిత్యావసర వస్తువులు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభిరామ్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి పి.లావణ్య, డివిజనల్ పంచాయతీ అధికారి రాఘవన్, రామవరప్పాడు సర్పంచ్ శ్రీదేవి, ప్రసాదంపాడు సర్పంచ్ సర్నాల గంగా రత్నం, పంచాయతీ కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో విద్యుత్ విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు విజయకుమారి ఆధ్వర్యంలో 39 బృందాలు విద్యుత్ తనిఖీలలో పాల్గొని 2,946 సర్వీసులను తనిఖీ చేశారు. నిబంధనలను అతిక్రమించి విద్యుత్‌ను అదనంగా వాడుకుంటున్న 215 సర్వీసులకు గాను 387 కిలోవాట్ల విద్యుత్‌ను వినియోగించినట్లు అధికారులు గుర్తించారు. వారి నుంచి రూ.7.74 లక్షలను అపరాధ రుసుంగా వసూలు చేశారు. ఈ తనిఖీల్లో ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు, డీఈఈ రామ్మూర్తి, ఇంకా పలువురు అధికారులు పాల్గొన్నారు.

శ్మశానాలకు స్థలాలు కేటాయించాలి



తహసీల్దార్ భావనారాయణకు వినతిపత్రం అందిస్తున్న మాలమహానాడు ప్రతినిధులు

కంకిపాడు: దళితులు శ్మశాన స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, శ్మశానాలకు స్థలాలు కేటాయించాలని మాలమహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు డిమాండ్ చేశారు. కంకిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వీ.భావనారాయణకు సోమవారం వినతి పత్రం అందించారు. రాజు మాట్లాడుతూ జిల్లాలోని 80 శాతానికి పైగా ఉన్న ఎస్సీ కాలనీల్లో శ్మశానానికి స్థలాలు లేవన్నారు. డొంకలు, రహదారి అంచుల్లోనే అంత్యక్రియలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. జనాభా పెరుగుదలతో అంత్యక్రియల నిర్వహణ కష్టంగా మారిందన్నారు. శ్మశాన స్థలాలు కొన్ని గ్రామాల్లో ఆక్రమణలకు గురయ్యాయని ఆరోపించారు. ఎస్సీ ఉప ప్రణాళిక నిధులతో శ్మశాన స్థలాలను అభివృద్ధి చేయాలని, ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. శ్మశానాలకు స్థలాలను కేటాయించాలని, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సిరివెళ్ల చిట్టిబాబు, వర్రె చిట్టిబాబు, మాచర్ల రవి, సరిహద్దు ఆంతోని, గద్దె నవీన్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణపతాకం ఎగరేద్దాం



ఉయ్యూరులో మువ్వన్నెల జెండాలతో మహిళల ర్యాలీ

ఉయ్యూరు: హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ శేషగిరిరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆదేశాలతో హర్ ఘర్‌తిరంగా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం ఉయ్యూరులో ర్యాలీ నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల మహిళలతో కలిసి త్రివర్ణపతాకాలు చేపట్టి ఎంపీడీఓ ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలన్నారు. ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు కార్యక్రమం దోహదపడు తుందన్నారు. షాదీఖానాలో నిర్వహించే ఉచిత కుట్టు శిక్షణకు మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు జాతీయ జెండాలతో ప్రత్యేక ర్యాలీ చేపట్టడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

పీ4లో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి



ప్రజాప్రతినిధులతో మాట్లాడుతున్న తహసీల్దార్, ఎంపీడీవోలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ4 కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని బాపులపాడు తహసీల్దార్ బండ్రెడ్డి మురళీకృష్ణ, ఇన్‌చార్జి ఎంపీడీవో త్రినాథరావు కోరారు. స్థానిక మహాత్మగాంధీ నగర్‌లోని మండల రెవెన్యూ కార్యాలయంలో పీ4 కార్యక్రమంపై ప్రజాప్రతినిధులతో అవగాహన సదస్సు నిర్వహించారు. పేదరిక నిర్మూలనకై పీ4 కార్యక్రమం ద్వారా మండలంలో 4,083 బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్లు చెప్పారు. వీరిలో 1,929 కుటుంబాలను ఇప్పటికే దత్తత తీసుకున్నారని, మిగిలిన కుటుంబాలను కూడా దత్తత చేపట్టేందుకు పారిశ్రామికవేత్తలు, రాజకీయ నాయకులు ముందుకు రావాలని వారు విజ్ఞప్తి చేశారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు, నాగార్జున సాగర్ ఎడమకాలువ ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, జనసేన గన్నవరం నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్‌బాబు, కొయ్యూరు సర్పంచ్ కొల్లి వీర వెంకట సత్యనారాయణ, మల్లవల్లి పీఏసీఎస్ చైర్మన్ జాన్ బాషా, వేలేరు మాజీ సర్పంచ్ వేముల పల్లి శ్రీనివాసరావు, హనుమాన్ షుగర్స్ మాజీ చైర్మన్ గుండపనేని ఉమావరప్రసాద్ పాల్గొన్నారు.

కల్యాణ మండపం ప్రారంభం



కల్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పయ్యావుల, యార్లగడ్డ

పొట్టిపాడు(గన్నవరం): గ్రామాల అభివృద్ధిలో దాతలు భాగస్వాములు కావాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో వన్ వే మిషన్, స్టార్ హాస్పిటల్స్ సంయుక్తంగా రూ.కోటి వ్యయంతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ.. ఎటువంటి లాభాపేక్ష లేకుండా సమాజ హితం కాంక్షిస్తూ కల్యాణ మండపం నిర్మించడం అభినందనీ యమన్నారు. ఆర్థికంగా స్థిరపడిన ప్రతిఒక్కరూ సొంత గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు కొంత మొత్తాన్ని కేటాయించాలని కోరారు. ఈ కల్యాణ మండపం నిర్మాణానికి వన్ వే మిషన్ భూమిని ఉచితంగా ఇవ్వగా, స్టార్ హాస్పిటల్ రూ.75 లక్షలు, గ్రామస్తులు రూ.25 లక్షల విరాళాలతో నిర్మాణం చేశారు. మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకటబాలవర్ధనరావు, సీతారామస్వామి, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సంతోషిమాత ఉత్సవాలు

పాయకాపురం(విజయవాడరూరల్): మూడు రోజులపాటు అత్యంత వైభవోపేతంగా జరిగిన పాయకాపురం జై సంతోషిమాత అమ్మవారి జయంతి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల అనంతరం అమ్మవారి సన్నిధిలో భక్తులకు మహా అన్నప్రసాదం చేశారు. కార్పొరేటర్ అలంపూర్ విజయలక్ష్మి, విజయ్‌కుమార్ పాల్గొని అన్నదానం చేశారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా పురవీధుల్లో తిరుగుతూ మేళతాళాలతో కోలాహలంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీమండ్రి నాగేశ్వరరావు, అగురు త్రినాథ్, బోనం నాగాంజనేయులు, డి.గుంటయ్య, సుభాషిణి, దామోదర్, మార్కేండేయులు, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమాచార హక్కుచట్టంపై అవగాహన పెంపొందించుకోవాలి..



విజేతలతో నిర్వాహకులు

మధురానగర్(విజయవాడసెంట్రల్):సమాచార హక్కుచట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని రాష్ట్ర సమాచార కమిషనర్ పి.శామ్యూల్ జొనాథన్ తెలిపారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల విద్య డైరెక్టర్ ఉత్తర్వుల మేరకు సమాచార హక్కు చట్టంపై రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శామ్యూల్ పాల్గొని పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభాగాల వారీగా జోనల్, జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఇక్కడ రాష్ట్ర స్థాయి పోటీలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని నిర్దేశించుకున్న లక్ష్యాలు చేరుకోవాలని సూచించారు. సమాచార హక్కుచట్టం ప్రాముఖ్యతను వివరించారు. తొలుత వ్యాసరచన, వక్తృత్వం, డిబేట్, క్విజ్ విభాగాల వారీగా పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.భాగ్యలక్ష్మి, ఇక్కా రవి, పోటీల కోఆర్డినేటర్ బాలసుబ్రహ్మణ్యం, కొల్లేటి రమేష్, యుగంధర్, అప్పారావు, అజయ్ బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



కంకిపాడు: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.16.38 లక్షలు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను సోమవారం కంకిపాడులోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, చిట్టూరి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఏఎంసీ డైరెక్టర్ గోగినేని వెంకటరమణ, షేక్ చిన్న నాసర్ వలీ (నన్న), అన్నే రామారావు, కాకుమాను రమేష్, ముప్పా రాజా, సుంకర శివ, కె.సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

స్థానిక రెల్లికాలనీలో నివాసం ఉంటున్న 20 మంది పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 42 ఏళ్లుగా సమస్య పరిష్కారానికి నోచుకోలేదన్నారు. స్థలాలపై వారికి హక్కు కలిస్తూ పట్టాలు అందిస్తున్నామని వివరించారు. ఉయ్యూరు ఆర్‌డీఓ హెలా షారోన్, తహసీల్దార్ వీ.భావనారాయణ, ఎంపీడీఓ అనూష, సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, చిట్టూరి నాగేశ్వరరావు, ముప్పా రాజా పాల్గొన్నారు.